నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, మంగళవారం 21 జనవరి 2025 KARIMNAGAR

## మూడు కుక్కలు.. బాలుడికి 32కాట్లు




కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు రియాన్ష్

ఓదెల, జనవరి 20: పల్లెల్లో కుక్కలు భయపెడుతున్నాయి. చిన్నపిల్లలు కనిపిస్తే చాలు దాడులు చేస్తున్నాయి. సోమవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో ఓ బాలుడిని 32 చోట్ల కరిచాయి. గూడెం గ్రామంలో ఎప్పటిలాగే ఇంటి ముందు ఆడుకుంటున్న రియాన్ష్ (4)పై మూడు కుక్కలు ఒక్క సారిగా దాడి చేశాయి. ఎక్కడపడితే అక్కడ కరిచాయి. బాలుడి ఏడుపు విని తల్లిదండ్రులు బయటికి వచ్చి కొట్టడంతో అవి అక్కడి నుంచి వెళ్లిపోయాయి. వెంటనే బాలుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, 32 చోట్ల కుట్లపడ్డాయని తల్లిదండ్రులు రోదిస్తూ తెలిపారు. తమ గ్రామంలో స్వైర విహారం చేస్తున్న శునకాల నుంచి కాపాడాలని గ్రామస్తులు వేడుకుకుంటున్నారు.



పార్టీ నేతలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

## అక్రమ కేసులకు భయపడద్దు

- పార్టీ మీకు అండగా ఉంటుంది • మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్, జనవరి 20: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కారు పెడుతున్న అక్రమ కేసులకు భయపడవద్దని, ధైర్యంగా ఉండాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. ఇటీవల తంగళ్లపల్లి మండలంలో పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండలకేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య ఇటీవలే బెయిల్‌పై విడుదలై రాగా, సోమవారం ఆయన నివాసానికి వెళ్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేశామని, ఎన్నో కేసులను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన వెంట బొల్లి రామ్మోహన్, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, బండి జగన్, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రావు ఉన్నారు.

# సబ్సిడీ సిలిండర్ తుస్!?

- దరఖాస్తుదారుల్లో 50 శాతం మందికి అనుమానమే
- ఎంతమందికి ఇస్తున్నారో..? సమాచారం కరువు
- అత్యంత గోప్యంగా వివరాలు • హైదరాబాద్ స్థాయిలోనే డేటా
- తమకేమి తెలియదంటున్న అధికారులు • జగిత్యాల జిల్లాలో తొమ్మిది నెలల్లో ఒక్కో కుటుంబానికి సగటున 3 రిఫిళ్లు కూడా అందని వైనం



**సబ్సిడీ సిలిండర్ అటకెక్కుతున్నది. మహాలక్ష్మి పథకంలో ₹500కే అందిస్తామని ఎన్నికల ముందు బీరాలు పలికిన కాంగ్రెస్ సర్కారు, తీరా గెలిచిన తర్వాత తుస్సుమనిపిస్తున్నది. అనేక కొర్రీలు, సవాలక్ష ఆంక్షలు పెట్టి కనీసం 50 శాతం మందికి కూడా రాయితీ ఇవ్వడం లేదని తెలుస్తున్నది. అయితే అర్జీలో గానీ, సర్టిఫికెట్లలో గానీ చిన్న అక్షర దోషం ఉన్నా రిజెక్ట్ చేస్తున్నదని, కార్యాలయాల చుట్టూ తిరగలేక అలసిపోతున్నామని పేదలు వాపోతున్నా యంత్రాంగం నుంచి సరైన స్పందన కరువవుతున్నది. అయితే లబ్ధిదారులు లెక్క, ఎంతమందికి ఇస్తున్నారని అడిగితే తమకు తెలియదనడం, వివరాలు అత్యంత గోప్యంగా ఉంచడం, హైదరాబాద్ స్థాయిలోనే అంతా జరుగుతున్నదని అధికారులు చెబుతుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.**

జగిత్యాల, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : కొండంత రాగం తీసి, కూసింత పాట పాడినట్టుగా ఉన్నది కాంగ్రెస్ సర్కారు తీరు! ఎన్నికలకు ముందు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ₹500కే సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ ఇస్తున్నామని గొప్పలు చెప్పింది. సబ్సిడీ సిలిండర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సవాలక్ష ఆంక్షలను పెట్టింది. తెల్లరేషన్ కార్డుదారులకే ఇస్తామని చెప్పింది. అలాగే మహిళపై గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండాలన్న నిబంధన లేకున్నా, అనధికారికంగా అనుసరిస్తున్నట్టు తెలుస్తున్నది. రేషన్‌కార్డులో ఉన్న పేరు, గ్యాస్ సిలిండర్ కనెక్షన్ పేరు సరిపోవాలి. అక్షర దోషం ఉన్నా, సబ్సిడీ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దాంతోపాటు గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, ఆధార్‌కార్డు నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు అన్ని సరిపోవాలని చెబుతున్నారు. ఈ నిబంధనల నేపథ్యంలో అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనం పొందలేకపోతున్నామని, దరఖాస్తుదారులను ప్రభుత్వం అనేక విధాలుగా వడగట్టి సబ్సిడీ సిలిండర్ ఇస్తున్నదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇక లబ్ధిదారుడికి ఏడాదికి ఎన్ని సబ్సిడీ సిలిండర్లు అందజేయాలన్న విషయంలోనూ ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. గతంలో ఎల్పీజీ సిలిండర్ కనెక్షన్‌దారుడు మూడేండ్ల కాలంలో సగటున నెలకు ఎన్ని సిలిండర్లు వాడారో..? అన్ని రిఫిళ్లను మాత్రమే ₹500కు పంపిణీ చేయాలని నిబంధన పెట్టింది. ఈ లెక్కన ఒక కుటుంబం మూడేండ్ల వ్యవధిలో 36 సిలిండర్లు వినియోగిస్తే, నెలకు ఒక్క సిలిండర్ సబ్సిడీపై ఇస్తుంది. అంతకంటే ఎక్కువ వినియోగించినట్లయితే అదనపు వాటికి సబ్సిడీ వర్తించని పరిస్థితి నెలకొంది. అలాగే వినియోగదారుడు రిఫిల్ కోసం బుక్ చేసుకొని ఇంటికి వచ్చిన తర్వాత ధర పూర్తిస్థాయిలో చెల్లించాలని నిర్దేశించింది. డెలివరీ అయిన కొద్ది రోజుల్లో లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేస్తున్నది. ప్రస్తుతం 14 కిలోల సిలిండర్ ధర ₹875 ఉండగా, అందులో కేంద్ర ప్రభుత్వం ₹47, రాష్ట్ర ప్రభుత్వం ₹327 సబ్సిడీ రూపేణా అందజేస్తున్నది. వినియోగదారులకు ₹500కే పడుతుంది.

### సగటున కుటుంబానికి మూడు సిలిండర్లే..

గ్యాస్ సిలిండర్ల పంపిణీ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. సబ్సిడీ సరిగా పడడం లేదని, ఎప్పుడు వేస్తున్నారో అర్థం కావడం లేదంటున్నారు. ఇంకా చాలా మంది అసలు తమకు సబ్సిడీ సిలిండరే రావడం లేదని, తమను ఎంపిక చేయలేదని ఆరోపిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు సైతం సబ్సిడీ సిలిండర్లకు సంబంధించిన వివరాలు చెప్పడం లేదు. అతి కష్టంపై జగిత్యాల జిల్లాకు సంబంధించి గతేడాది నవంబర్ వరకు సబ్సిడీపై వచ్చిన సిలిండర్ల సంఖ్య, సబ్సిడీ వివరాలు బయటకు వచ్చాయి. నవంబర్ వరకు వచ్చిన వివరాల ప్రకారం 1,93,900 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. నవంబర్‌లో లబ్ధిదారులకు 51,394 సబ్సిడీ సిలిండర్లను పంపిణీ చేశారు. దీనికి గాను ₹1.52 కోట్ల సబ్సిడీని ఇచ్చారు. అంతకు ముందు నెలలకు సంబంధించిన వివరాలను సైతం అందులో పొందుపర్చారు. మార్చి నుంచి నవంబర్ చివరి నాటికి 5,79,264 సిలిండర్లకు సబ్సిడీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనికి గాను ₹17.26 కోట్ల సబ్సిడీని ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 2,89,725 మంది లబ్ధిదారులు ఉంటే అందులో 1,93,900 లక్షల మందికి మాత్రమే సబ్సిడీ సిలిండర్లు అందినట్లు స్పష్టమైంది. దాదాపు మరో లక్ష మందికి సబ్సిడీ అందడం లేదని తేటతెల్లమైంది. 1,93,900 మందికి 5,79,264 సిలిండర్లు మాత్రమే పంపిణీ చేశారంటే తొమ్మిది నెలల కాలంలో సగటున 3 కంటే తక్కువ సిలిండర్లు పంపిణీ జరిగినట్లు స్పష్టమవుతున్నది. ఈ లెక్కన ఒక కుటుంబానికి తొమ్మిది నెలల కాలంలో కనీసం ₹950 లబ్ధి కూడా కలుగలేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంతోటి సాయానికి ప్రభుత్వం తామేదో అన్ని కుటుంబాలను ఉద్ధరిస్తున్నట్టు, ₹500కే సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్టుగా ప్రకటించుకోవడంపై లబ్ధిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

### చేతులెత్తేస్తున్న అధికారులు!

గ్యాస్ సబ్సిడీ సిలండర్లకు సంబంధించిన వివరాలు అందజేయాలని జిల్లా పౌర సరఫర శాఖ అధికారులను కోరగా, వారు చేతులెత్తేశారు. 'మా వద్ద జిల్లాలో ఏయే రకం.. ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి? ఎంతమంది అర్హులు? అన్న వివరాలు మాత్రమే ఉన్నాయి. ఎంత మందికి సబ్సిడీ వర్తిస్తుంది? సగటున ఎంత మొత్తం సబ్సిడీ నిధులు వస్తున్నాయి? వివరాలు మా వద్ద లేవు. మాకే కాదు ఏ జిల్లాలోనూ ఆ వివరాలు అందుబాటులో లేవు' అని అధికారులు చెబుతున్నారు.

### దరఖాస్తు చేసుకొని లాభం లేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం ఏర్పాటుచేసిన ప్రజా పాలనలో ₹500కు సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్నం. కానీ, సిలిండర్ తీసుకున్న తర్వాత బ్యాంకు ఖాతాలో సబ్సిడీ డబ్బులు మాత్రం పడడం లేదు. ఆఫీస్‌కి వెళ్లి అడిగితే 'మేం బిల్లు కొట్టినం. మీ కనెక్షన్ వివరాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్ కార్డు, కరెక్ట్ ఉంటే బ్యాంకులో డబ్బులు పడతయి' అని అంటున్నరు. కానీ, పైసలు పడడం లేదు. మీ కార్డుల్లో, కనెక్షన్ కార్డులో తప్పులున్నయని మండల ఆఫీస్‌కు పోయి అడుగమంటున్నరు. అక్కడికి పోతే ఒకసారి సర్వర్ డౌన్ అని, ఇంకోసారి సార్ రాలేదని తిప్పి పంపుతున్నరు. తిరిగీ తిరిగీ ఇబ్బందైతంది. సబ్సిడీ సిలిండర్ వస్తదో రాదో..

**- కెక్కెర స్వప్న, రాపల్లి గ్రామం (గొల్లపల్లి మండలం)**

### అంత ఉత్త ముచ్చటే సార్



కాంగ్రెస్ ప్రభుత్వం ₹500కు సిలిండర్ ఇస్తామని ప్రకటించినంక దానికోసం ఆగమై తిరుగుతున్న. డబ్బులు బ్యాంకులో పడాలంటే మండల్ ఆఫీస్‌కు పొమ్మని గ్యాస్ కంపెనీ వాళ్లు అంటున్నరు. మండల్ ఆఫీస్కు పోతే అదేందో అయితలేదు అంటున్నరు. నాకు సక్కగ తెలువదు. ఎవరికి చెప్పినా పట్టించుకుంట లేరు. నేను ఎవరికి చెప్పుకోవాలి..? ఎటు తిరగలేక చెప్పలేక ఉంటున్నా. గ్యాస్ పైసలు రావు. మన్ను పైసలు రావు. అంత ఉత్త ముచ్చటే సార్.

**- మారంపల్లి పోషవ్వ, గృహిణి, రాపల్లి (గొల్లపల్లి మండలం)**



32వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- పెండింగ్ పనులకు సీఎం అస్యూరెన్స్ నిధులు విడుదల చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 20 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగి కరీంనగర్ రూపురేఖలు మారాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గుర్తు చేశారు. సోమవారం కరీంనగర్ 32వ డివిజన్‌లో ₹45 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఏళ్ల తరబడిగా ఉన్న మట్టి రోడ్లన్నీ బీఆర్ఎస్ పాలనలో సీసీ రోడ్లుగా మారాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నేరుగా నిధులు ఇవ్వడం వల్లనే పెద్ద ఎత్తున పనులు చేయగలిగామని చెప్పారు. గతంలో సీఎం అస్యూరెన్స్ కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనికి సంబంధించిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులన్నింటినీ పూర్తి చేసి, మరిన్ని కొత్త నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తేనే ప్రజలు హర్షిస్తారని హితవుపలికారు. నగరంలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గతంలో తాము మొదలు పెట్టిన మానేర్ రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జి, ఇతర అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేస్తేనే ప్రజలు ప్రస్తుత ప్రభుత్వాన్ని హర్షిస్తారని, లేకపోతే నిలదీసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మర్రి భావన, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తోట రాములు, ఐలేందర్, తదితరులు పాల్గొన్నారు.



..ఈ చిత్రంలోని బొలెరో క్యాంపర్‌లో కనిపిస్తున్నది సింగరేణి బొగ్గు. ఈ నెల 7న ఆర్జీ-2 పరిధిలోని లక్ష్మీపూర్ వద్ద రైల్వే వ్యాగన్ల నుంచి అక్రమంగా తీసి లోడ్ చేయగా, సింగరేణి ఆర్జీ-1 సీనియర్ సెక్యూరిటీ అధికారి ఎం వీరారెడ్డి, తన సిబ్బందితో అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. బొగ్గు విలువ దాదాపుగా రూ.15వేల దాకా ఉంటుంది.



కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

## సమస్యలు పరిష్కరించండి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికుల రిలే దీక్ష

కరీంనగర్ ముకరంపుర, జనవరి 20: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టిజన్ కార్మికులు సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసనకు దిగారు. విద్యుత్ సంస్థలో ఏళ్ల తరబడిగా వెట్టిచాకిరీ చేస్తున్న తమను కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ(టీవీఏసీ-జేఏసీ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కరీంనగర్‌లోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట చేపట్టి దీక్షల్లో జేఏసీ నాయకులు మాట్లాడారు. విద్యుత్ సంస్థ ఆర్టిజన్లుగా పేర్కొంటున్నప్పటికీ తామంతా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నామని, వారి కంటే ఎక్కువగా శ్రమించినా ఎలాంటి ఫలితం, లబ్ధి అందడం లేదన్నారు. విద్యార్హతలకు అనుగుణంగా తమను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల ప్రయోజనాలు, సౌకర్యాలు తమకు వర్తింప చేయాలని కోరారు. కార్మికుల దీక్షకు పలు యూనియన్లు, అసోసియేషన్ల ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఇక్కడ టీవీఏసీ-జేఏసీ జిల్లా చైర్మన్ శివకృష్ణ, నాయకులు సదానందం, రఘునాథ్‌రెడ్డి, జీవన్, అమానుల్ల, కే శ్రీనివాస్ నాయక్, సంతోష్, కనకారెడ్డి, చందర్‌సింగ్ ఠాకూర్, పీ శ్రీనివాస్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచి కప్‌ను అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేతగా కరీంనగర్

కొత్తపల్లి, జనవరి 20 : తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ 46వ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు విజేతగా నిలిచి కప్‌ను సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో వరంగల్ జట్టుతో పోటీపడ్డ కరీంనగర్ క్రీడాకారులు హోరాహోరీ పోరులో 18-16 తేడాతో గెలుపొందారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 18 నుంచి 20 వరకు పోటీలు జరిగాయి. కాగా, సోమవారం జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ కుమార్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నమలికొండ ప్రభాకర్, రెఫరీస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గును దోచేస్తున్నరు

- పారిశ్రామిక ప్రాంతంలో మళ్లీ కోల్ దందా
- ఎన్టీపీసీకి రవాణా అయ్యే రైల్వే వ్యాగన్ల నుంచి అర్ధరాత్రి చోరీ
- లక్ష్మీపురం, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ల సమీపంలో ముఠాలు
- తరలిపోతున్న రూ.లక్షల విలువైన సంపద
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**కోల్ మాఫియా కోరలు చాస్తున్నది. కొద్దిరోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చెలరేగిపోతున్నది. సింగరేణి నుంచి ఎన్టీపీసీకి రవాణా చేసే రైల్వే వ్యాగన్ల నుంచి సరుకును లూటీ చేస్తున్నది. గతంలో పీడీ యాక్టులు, కేసులతో కొంత వెనక్కి తగ్గినా, ఇటీవలి కాలంలో మళ్లీ దందా మొదలు పెట్టింది. లక్ష్మీపురం, మారేడుపాక, ఎల్కలపల్లి గేట్ల సమీపంలో ముఠాలు ఏర్పరుచుకొని, ప్రతి రోజూ తెల్లవారుజామున 2 నుంచి 5 గంటల మధ్య రైలు ఆగగానే పైకి ఎక్కి అందినకాడికి దోచుకుంటున్నది. గుట్టుచప్పుడు కాకుండా కరీంనగర్ జిల్లాలోని ఇటుక బట్టీలు, హైదరాబాద్‌ల్లోని పరిశ్రమలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నది.**

పెద్దపల్లి, జనవరి 20(నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. డీ గ్రేడు ధర టన్నుకు రూ.2800 నుంచి రూ.3 వేలు పలుకుతున్నది. బహిరంగ మార్కెట్లో మాత్రం అంతకు రెండు, మూడింతలు వచ్చే అవకాశాలతో మాఫియా కన్నేసింది. రైల్వే వ్యాగన్ల నుంచి చోరీ చేస్తూ తరలించుకుపోతున్నది.

### అక్రమ రవాణా ఇక్కడి నుంచే..

సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గును ఎన్టీపీసీ తన అవసరాల కోసం తరలించుకుంటున్నది. ఇందుకు ప్రత్యేక రైల్వే లైన్ నుంచి రేకుల ద్వారా తీసుకెళ్తుంది. ఆర్జీ-1 సీఎస్పీ, ఓసీపీ-3 సీఎస్పీ, ఓసీపీ-1 సైలోల నుంచి రవాణా జరుగుతుంది. రేకులు కూడా వారికి కేటాయించిన టైమ్ టేబుల్ ప్రకారం వెళ్తాయి. ఈ రైలు వెళ్లే టైంనే స్మగ్లర్లు అక్రమ రవాణాకు అడ్డాగా మల్చుకున్నారు. చీకటి పడిందంటే చాలు రైలు మార్గం ఉన్న మారేడుపాక, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ల మధ్య పదుల సంఖ్యలో ముఠాలు వ్యాగన్ల పైకి ఎక్కి వాటి పై నుంచి బొగ్గును లూటీ చేస్తున్నారు. ఎవరూ కనిపించని నిర్దేశిత ప్రాంతంలో బొగ్గును కింద పడేస్తుండగా, కింద ఉండే సహచరులు ఒకచోటికి చేర్చి, వెంట తెచ్చుకున్న ట్రాక్టర్లు, బొలెరో క్యాంపర్లు, ట్రక్కుల్లో లోడ్ చేస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తూ, ఎంచుకున్న ప్రదేశాలకు తీసుకువెళ్లి టన్నుకు రూ.3వేల నుంచి రూ.10వేల దాకా విక్రయిస్తున్నారు. జిల్లా అధికారుల కండ్లు గప్పి ఉమ్మడి జిల్లాలోని ఇటుక బట్టీలతో పాటు హైదరాబాద్ ప్రాంతంలోని పరిశ్రమలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

### చేష్టలుడిగి చూస్తున్న సింగరేణి, ఎన్టీపీసీ

దేశంలోనే అతి పెద్ద పరిశ్రమలుగా ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలు ప్రభుత్వం మాదిరి అన్ని రకాల ప్రత్యేక వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ప్రత్యేక రక్షణ విభాగాలతో నడుస్తున్నాయి. అలాంటి అతి పెద్ద కంపెనీలు చేసే వ్యాపారం, వినియోగం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పడానికి చోరీ ఘటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. గతంలో సింగరేణి, ఎన్టీపీసీ రక్షణ విభాగాలతో పాటు పోలీస్ శాఖ కలిసి ఉమ్మడిగా నిఘా పెట్టి తనిఖీలు చేసి పకడ్బందీగా చోరీలను అరికట్టాయి. ఇటీవల ఆయా శాఖల మధ్య సమన్వయం కొరవడింది. తమ గనుల పరిధి దాటిన బొగ్గుతో తమకు సంబంధం లేదని సింగరేణి అంటుంటే, సింగరేణిదే బాధ్యత అంటూ ఎన్టీపీసీ భావిస్తుండడంతో స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతున్నది. అయితే, ఈ లూటీకి ఆయా సంస్థల రక్షణ విభాగాలు కూడా పరోక్షంగా సహకరిస్తున్నాయనే ప్రచారం ఉన్నది.

### మూడు పూలు, ఆరు కాయలుగా అక్రమ దందా

సింగరేణి బొగ్గు లూటీ అవుతున్న నేపథ్యంలో అటు సింగరేణి అధికారులు, ఇటు ఎన్టీపీసీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ఏదో నామ్‌కే వాస్తేగా అప్పుడప్పుడు సింగరేణి భద్రతా సిబ్బంది దాడులు చేసి, కేవలం వేల రూపాయల విలువైన బొగ్గును మాత్రమే పట్టుకుంటున్నాయని, రూ.లక్షల విలువైన బొగ్గును పట్టించుకున్న పాపాన పోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడ్డ సందర్భాల్లో సిబ్బందికి మామూళ్లు ముట్టజెప్పితే వదిలి పెడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. బొగ్గు స్మగ్లింగ్ వల్ల అటు సింగరేణి, ఇటు ఎన్టీపీసీ, గూడ్స్ రైల్ సిబ్బంది, పోలీసులకు నెల నెలా మామూళ్లు అందుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

### అసలు ఆ బొగ్గు ఎవరిది..!?

జిల్లాలో ఇటీవల వరుసగా రెండుసార్లు అక్రమంగా బొగ్గును తరలిస్తుంటే భద్రతా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది సింగరేణి నుంచి ఎన్టీపీసీకి తరలిస్తుండగా రైల్వే బోగీల నుంచి చోరీ చేసిన బొగ్గు అని, అయితే డ్రైవర్ రైలును ఆపడం వల్లే చోరీ జరిగినట్లుగా గుర్తించారు. అయితే, 7న లక్ష్మీపూర్ క్రాస్ దగ్గర స్వాధీనం చేసుకున్న బొగ్గు ఆర్జీ-1 ఏరియాలో పట్టుకోగా, అది ఆర్జీ-2కు సంబంధించిన బొగ్గుగా భావిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న బొగ్గుపై కేసు నమోదు చేసి ఠాణాకు తరలించారు. ఆర్జీ-1 సీఎస్పీలో అన్‌లోడ్ చేశారు. అలాగే, 9న ఎల్కలపల్లి వద్ద ట్రాక్టర్‌లో లోడ్ చేసి తరలిస్తున్న బొగ్గును ఆర్జీ-2 భద్రత అధికారులు స్వాధీనం చేసుకొని, గోదావరిఖని టూటౌన్ ఠాణాకు తరలించారు. అయితే, ఈ రైల్వే బోగీల్లో అటు ఆర్జీ-1 బొగ్గు, ఆర్జీ-2బొగ్గు తరలిస్తున్నారు. అయితే, ఈ బొగ్గు ఎవరు లోడ్ చేశారనేది మాత్రం తెలడం లేదు. పోలీసులు ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదు.

### కట్టడికి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం

రెండు ఘటనలతో సింగరేణి బొగ్గు చోరీకి గురవుతున్నట్లు గుర్తించాం. కట్టడి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. జరుగుతున్న చోరీలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. పోలీసులు, ఇంటిలిజెన్స్ అధికారులు పూర్తిగా విచారణ జరుపుతున్నారు. ఎన్టీపీసీ, రైల్వే పోలీసు సైతం దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. లోడింగ్ వరకే తమకు సంబంధం ఉంటుంది. లోడింగ్ చేసి ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్న సమయంలో ఎన్టీపీసీ, ఆర్పీఎఫ్ వాళ్లే చూసుకోవాలి. ఇందుకు గాను వారికి లెటర్ పెట్టాం.

**- షరీఫ్, ఆర్జీ-2 సీనియర్ సెక్యూరిటీ అధికారి (రామగుండం)**



.. పై ఫొటోలో కనిపిస్తున్నది ఆర్జీ-2 పరిధిలో అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న సింగరేణి బొగ్గు. ఎల్కలపల్లి శివారులోని పోచమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్‌లో బొగ్గు లోడ్ చేసి ఉండగా, సమాచారం మేరకు ఆర్జీ-2 సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ బొగ్గు విలువ దాదాపు రూ.18వేల వరకు ఉంటుంది.